నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

నిజామాబాద్-కామారెడ్డి

గురువారం | ఫిబ్రవరి 20, 2025 | www.navatelangana.com

షార్ట్ సర్క్యూట్‌తో మీ సేవ దగ్ధం

నవతెలంగాణ-నిజాంసాగర్

షార్ట్ సర్క్యూట్‌తో మీ సేవ దగ్ధమైన ఘటన మండలంలోని మల్లూరు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితుడు మైపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 11 గంటల సమయంలో ఎలక్ట్రిక్ బోర్డులో ఒక్కసారిగా షర్ట్ సర్క్యూట్ కావడంతో షాప్ మొత్తం మంటలు వ్యాపించాయి. ప్రింటర్, కంప్యూటర్, పత్రాలు మిగతా సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. మొత్తం రూ.లక్ష 50 వేలు నష్టం వాటిల్లింది. మీసేవ మీదనే ఆధారపడిన బాధితుడు షాప్ కాలిపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. వెంటనే ప్రభుత్వం స్పందించి తగు న్యాయం చేయాలని ఆయన కోరారు.



కాలిపోయిన వస్తువులు

బాల సదన్ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం కామారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.నాగరాణి పట్టణంలోని హరిజనవాడ బాలసదనం (గవర్నమెంట్ చిల్డ్రన్ హెూమ్)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిల్డ్రన్ హెూమ్‌లోని పిల్లలతో మాట్లాడి సౌకర్యాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు సంబంధించించిన హక్కులను తెలియజేశారు. ఆపరేషన్ స్మైల్‌లో కాపాడబడిన బాలికలు బాలసదనంలో చేరారు. ఆ పిల్లలను తక్షణమే బడిలో చేర్పించాలని బాల సదనం సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్ కుమార్, సాయి, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.



పిల్లలతో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

సంపన్నుల, కార్పొరేట్ల బడ్జెట్

- సామాన్య, మధ్యతరగతి ప్రజలకు వ్యతిరేకం
- బోధన్ - బీదర్ రైల్వే మార్గం ఊసే లేదు
- వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పలుచోట్ల నిరసనలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/బోధన్/గాంధారి

కేంద్ర బడ్జెట్ సంపన్నులకు, కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని.. కానీ సామాన్య, మధ్యతరగతి ప్రజలకు వ్యతిరేకమని వామపక్ష పార్టీల నాయకులు విమర్శించారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ప్లకార్డులతో నల్ల బ్యాడ్జీలను ధరించి ధర్నా చౌక్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ సంపన్నులకు, కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్నదని ఈ దేశంలో జీఎస్టీ చెల్లిస్తున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలకు వ్యతిరేకంగా ఉందని తెలిపారు. వ్యవసాయ రైతాంగానికి, నిరుద్యోగులకు ఈ బడ్జెట్లో నామమాత్ర కేటాయింపులే ఉన్నాయని అన్నారు. బోధన్ – బీదర్ రైల్వే మార్గం ఊసే లేదని, ఈ మధ్యకాలంలో ప్రకటించిన పసుపు బోర్డుకు నిధులు కేటాయించలేదని ఇకనైనా బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ. రమేష్‌బాబు, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, సిపిఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, సిపిఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఖజా, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గంగాధర్ మాట్లాడుతూ.. దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడం కోసం ఈ బడ్జెట్ రూపొందించలేదని పేద వర్గాలను వదిలి సంపన్న వర్గాలకు రాయితీలు చెల్లించే విధంగా ఈ బడ్జెట్ ఉందని తెలిపారు. తెలంగాణ విభజన హామీ కేటాయింపులు లేవని, జాతీయ గ్రామీణ ఉపాధి పనులను సంవత్సరానికి 200 రోజులకు పెంచుతూ 600 రూపాయల కూలి చెల్లించే విధంగా బడ్జెట్ రూపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు అడ్డికే రాజేశ్వర్, కే రాజయ్య, సిపిఐ(ఎం) జిల్లా నాయకులు పెద్ది వెంకట్రాములు, నూర్జహాన్, సిపిఐఎంఎల్ మాస్‌లైన్ నగర కార్యదర్శి ఎం.సుధాకర్, వెంకన్న, సాయన్న, గంగాధర్, వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌సిటీ : నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

బోధన్ : కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ బిల్లును నిరసిస్తూ బుధవారం వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేంద్రప్రభుత్వం దిష్టిబొమ్మను నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా టీయూసీఐ రాష్ట్ర నాయకులు బి.మల్లేష్, ఐఎఫ్‌టీయూ నాయకులు పి.వరదయ్య, సీఐటీయూ నాయకులు జే.శంకర్ గౌడ్ మాట్లాడుతూ మూడవ సారి ఇతర పార్టీల మద్దతుతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఏ మాత్రం ప్రజా ఆమోదమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టలేదని, ఇది బడాపెట్టుబడుదారుల, కార్పోరేట్‌ల బడ్జెట్ అని మండిపడ్డారు. గతంలో రైతులు 13 నెలలు ఢిల్లీలో రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడితే, ఆ రోజు రైతాంగానికి క్షమాపణ చెప్పిన మోడీ, వాటి విషయంలో మోడీ ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని తీవ్రంగా విమర్శించారు. అనేక త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తూ, కార్మిక వ్యతిరేక నాలుగు కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. 16 గంటలు పని దినాలను పనిచేయించాలని కార్పొరేట్ కంపెనీల మెప్పు పొందే విధానాలను అమలు చేయిస్తుందని, విద్యా వైద్య ఉద్యోగ, సామాజిక భద్రత, ఉపాధిహామీ కూలీ రేట్ల బడ్జెట్ పెంపు లేకపోవడాన్ని విమర్శించారు. ఈ బడ్జెట్‌ను సవరణ చేసి ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇర్షాద్, అంజాద్, ఎం.శాంతాబాయ్, ఎం.పోశెట్టి, కల్పనా, సుధాకర్, ఎల్లయ్య, సంగెం గంగాధర్, టి.సాయిలు, రాజకుమార్, లక్ష్మణ్‌గౌడ్, వినోద్, గౌతమ్ కుమార్, భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ఉపసంహరించుకోవాలి..

గాంధారి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో కేంద్ర బడ్జెట్ పత్రాలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ కార్పొరేట్ల కోసమే తప్ప పేద ప్రజల కోసం కాదన్నారు. రైతులకు, కార్మికులకు, కూలీలకు జీరో బడ్జెట్‌తో ముగించారని తెలిపారు. వెంటనే ఈ మోసపూరితమైన బడ్జెట్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ప్రకాష్‌నాయక్, సిఐటియు మండల నాయకులు, సరాబ్ కిషన్ రావు, గిరిజన సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



బోధన్ : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



గాంధారి : ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగొద్దు

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



విద్యుత్ శాఖ అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కామారెడ్డి పట్టణంలోని కాకతీయనగర్‌లోని 33/11 కేవీ ఉప కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. విద్యుత్ సరఫరా ఎక్కడి నుంచి వస్తుంది, ఎంత మేరకు సరఫరా చేయబడుతుంది, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయ చర్యలు ఎలా తీసుకుంటారు, ఎంత మంది సిబ్బంది విధుల్లో ఉంటారు, అనే విషయాలను విద్యుత్ శాఖ ఎస్ఈ ఎన్.శ్రావణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. 132/33 కేవీ సబ్‌స్టేషన్ కామారెడ్డి నుంచి సరఫరా అవుతుందని, రెండు 5 ఎం.బి.ఏ. ట్రాన్స్‌ఫార్మర్స్ నుంచి 33/11 కేవి సబ్ స్టేషన్‌లోకి కన్వర్ట్ చేయబడి పలు మార్గాల గుండా విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఏసి, డిసి కంట్రోల్ ప్యానల్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ స్టేషన్‌లో రౌండ్ ద క్లాక్ సిబ్బంది అందుబాటులో ఉండి విద్యుత్ సరఫరాను పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ కళ్యాణ్ చక్రవర్తి, ఏడిఈ కిరణ్ చైతన్య, ఏఈ వెంకటేష్, డిఈ ఏంఆర్టి నాగరాజు, ప్రొటెక్షన్ ఏడిఈ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-పోతంగల్ (కోటగిరి)

మండలంలోని సుద్దులంలో శివాజీ విగ్రహాన్ని వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ మహారాజ్ సామాన్య ప్రజలకు అండగా నిలిచిన వీరుడని, అందరికీ ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో విగ్రహ దాత పోచారం సురేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్, మాజీ సర్పంచ్ సాయిలు, ఎజాజ్ ఖాన్, గోవింద్, సుధాకర్, సోఫాన్, గ్రామ ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దు

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

నవతెలంగాణ-బీర్కూర్(నసురుల్లాబాద్)

వేసవికాలం సమీపిస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సమన్వయంతో పని చేయాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి తెలిపారు. గురువారం బీర్కూర్ మండలంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఉదయం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గల తెలంగాణ తిరుపతి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. అనంతరం బీర్కూర్ గ్రామపంచాయతీ అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. నాటిన మొక్కలకు ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీళ్ల పోసే విధానాన్ని పరిశీలించారు. బీర్కూర్ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. అక్కడి నుంచి బీర్కూర్ మండల పీహెచ్‌సీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. ఆస్పత్రికి సంబంధించిన వైద్య సిబ్బందికి మందులు అందుబాటులో ఉన్నాయా అని ప్రశ్నించారు. అక్కడి నుంచి కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలను విద్యార్థులు కలిసి భోజనం చేశారు. కస్తూర్బా పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జరగబోయే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులందరూ ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత పొందే విధంగా కృషి చేయాలని ఆయన అన్నారు. మండల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించి వేసవి కాలంలో కరెంట్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వేసవి కాలంలో నీటి సరఫరా అంతరాయం కలగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై తాగునీటి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సాగునీటి సరఫరాపై అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలో పంచాయతీరాజ్ రెవెన్యూ తాగునీటి వివిధ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి వచ్చే వేసవిలో అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం గురుకుల పాఠశాలలో భోజనం నాణ్యతగా ఉండాలని సూచించారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వీరి వెంట తహసీల్దార్ లత, ఎంపీడీవో భాను ప్రకాష్, ఎంపీఓ మహబూబ్, ఎంఈఓ వెంకన్న, మండల స్పెషల్ అధికారి అనిల్ కుమార్, వివిధ గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డైరెక్ట్ కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలు డైరెక్ట్ కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు శాఖ మంత్రి ఆదేశానుసారం డైరెక్ట్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. రైతులు బాగా ఎండబెట్టి, చెత్త చెదారం లేకుండా మార్కెట్ యార్డునకు తీసుకొని వస్తే ఎలాంటి కమీషన్ లేకుండా రైతు ఖాతాలో డబ్బులు పడే అవకాశం వుందని సూచించారు. రైతుసోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగించు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రెటరీ అపర్ణ, శ్రీధర్ మార్కెట్ కమిటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సదుపాయాలున్నాయా..?

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆరా
- కోటగిరిలో బాలుర మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, పోతంగల్ పీహెచ్‌సీ పరిశీలన

నవతెలంగాణ-పోతంగల్

కోటగిరిలో బాలుర మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పోతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతుండగా, సరిపడా ఫ్యాకల్టీ ఉన్నారా అని ప్రిన్సిపాల్ డాక్టర్ మొహమ్మద్ ముబీన్‌ను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, డైనింగ్‌హాల్, స్టోర్‌రూంలను సందర్శించి, బియ్యం నిల్వలు, కూరగాయల నాణ్యతను, సరుకుల స్టాక్‌ను పరిశీలించారు. వంట నూనె, పాలు, కోడిగుడ్ల నాణ్యత పరిశీలించిన కలెక్టర్, కాల పరిమితి ముగిసిన వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించకూడదని నిర్వాహకులకు సూచించారు. పాఠశాల సముదాయాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మెనూ పట్టికను పరిశీలించి, విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పోతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. స్థానికంగా నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, రోగులకు అందిస్తున్న చికిత్సల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఎంత మంది రోగులు చికిత్స కోసం ఆసుపత్రికి వస్తున్నారనే వివరాలను రిజిస్టర్లో పరిశీలించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యులకు సూచించారు. రోగులను పలుకరించి వారికి మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయా, పీ.హెచ్.సీలోనే ఔషధాలను అందిస్తున్నారా అని ఆరా తీశారు. సమయ పాలన పాటిస్తూ అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని మెడికల్ ఆఫీసర్‌కు, సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కన్వీనర్ కే చంద్రశేఖర్ డిమాండ్
- సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ పరిధిలో స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ కే చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ముందు మున్సిపల్ కార్మికులతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి కే చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనం, రెండు నెలల ఏరియర్స్, ఐదు నెలల పిఎఫ్, ఈఎస్ఐ వెంటనే చెల్లించాలని, మున్సిపల్ కార్మికుల హాజరు పాయింట్లు రెండు చోట్లనే పెట్టాలని అన్నారు. 60 సంవత్సరాలు నిండిన కార్మికుల ఇంటిలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, అనారోగ్య రీత్యా కార్మికులు బదిలిపెట్టే అవకాశం కల్పించాలని, కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. పోలీసుల ద్వారా అనేక వేధింపులు, ఫైన్లు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటర్ వర్క్స్ సిబ్బందికి, స్ట్రీట్ లైట్ సిబ్బందికి కేటగిరీల వారిగా జీతాలు పెంచి ఇవ్వాలని, ఫిల్టర్ బెడ్‌ల వద్ద పనిచేస్తున్న కార్మికులకు ఎనిమిది గంటల పనిదినాన్ని అమలు చేసి వారానికి ఒక సెలవు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో పెట్టబోయే బడ్జెట్లో మున్సిపల్ కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ పెట్టాలని, అలాగే పర్మినెంట్ చేయాలని కోరారు. లేదా కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో మార్చ్ ఒకటో తేదీ నుంచి 7వ తేదీ వరకు ఆందోళన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. మార్చి 4న మున్సిపల్ ఆఫీస్ ముట్టడిస్తామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి ఈ ధర్నా వద్దకు వచ్చి మాట్లాడారు. రెండు మూడు రోజుల్లో తన పరిధిలో ఉన్న స్థానిక సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో కార్మిక నాయకులు ధర్నా విరమించారు. ఈ ధర్నాకు సిఐటియూ జిల్లా నాయకులు వెంకట్ గౌడ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ముదాం అరుణ్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కందారపు రాజనర్సు, జిల్లా కార్యదర్శి మహిబూబ్, జిల్లా ఉపాధ్యక్షులు కాట్రియాల ప్రభు, దీవెన, నాయకులు ఎల్.బూధవ్వ, భూలక్ష్మి, విజయ్, సంతోష్, ఎల్లవ్వ నరసవ్వ, సుమారు 300 మంది కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

నిరుద్యోగుల పోరాటంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి

- పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్
- మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణ-కామారెడ్డి

నిరుద్యోగుల పోరాటం వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం పట్టణంలోని సత్యకన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల మీటింగ్‌లో వారు మాట్లాడుతూ.. నిరుద్యోగుల పోరాటం వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. పట్టభద్రులంతా ఏకమై తమ మొదటి ప్రాధాన్యత ఓటును కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షట్కార్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పాల్గొన్నారు.

రోడ్లపై వాటర్ క్యూరింగ్

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-నిజాంసాగర్

నవతెలంగాణ ఎఫెక్ట్

నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ కోసం అధిక లోడుతో గ్రామాలలో రోడ్లపై టిప్పర్లు ప్రయాణించడం ద్వారా రోడ్లు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో "ఇసుక తరలింపు ఇష్టారాజ్యం" అనే శీర్షికన సోమవారం నవతెలంగాణలో కథనం ప్రచురితమైంది. దీంతో మెగా ఇంజనీర్ కంపెనీ యాజమాన్యం స్పందించి గ్రామాలలోని రోడ్లపై వాటర్ క్యూరింగ్ చేపట్టారు.



డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రెండు రోజుల జైలు శిక్ష

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్ర శివారులో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డ మోర్తాడ్ మండలం డొంకల్ గ్రామానికి చెందిన గంగాధర బాబు రావు అనే వ్యక్తికి ఆర్మూర్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గట్టు గంగాధర్ రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం కేసు విచారణలో భాగంగా గంగాధర బాబు రావుకు ఆర్మూర్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గట్టు గంగాధర్ రెండు రోజుల జైలు శిక్షను ఖరారు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్ రెడ్డి మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపద్దన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాలను పాటిస్తూ వాహనదారులు వాహనాలను నడపాలని సూచించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే జరిమానాలతో పాటు కొన్నిసార్లు జైలు శిక్ష కూడా గురికావాల్సి వస్తుందని ఎస్ఐ అనిల్ రెడ్డి తెలిపారు.

గాజుల్‌పేట్‌లో చోరీ



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని గాజుల్ పేట్‌లో విద్యుత్ శాఖలో లైన్ మెన్‌గా పనిచేసే అజిత్ సింగ్ ఇంట్లో చోరీ జరిగింది. ఈ విషయం బుధవారం ఉదయం వెలుగు చూసింది. గాజుల్ పేట్ కద్దా ప్రాంతంలో నివాసం ఉండే అజిత్ సింగ్ కుటుంబ సమేతంగా బంధువుల ఇంట్లో జరిగిన రిసెప్షన్ కు వెళ్లారు.గుర్తు తెలియని వ్యక్తులు అజిత్ సింగ్ ఇంటి తాళాలు పగులగొట్టి, పడక గదిలో బీరువాను ధ్వంసం చేసి ఐదు తులాల బంగారం, రూ. లక్ష వరకు నగదు చోరి చేశారు. ఉదయం వేళ ఇంటి తాళాలు పగుల గొట్టిన విషయం తెలిసి అజిత్ సింగ్ కుటుంబానికి సమాచారం అందడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న రెండవ టౌన్ పోలీసులు ఘటన స్థలం చేరుకుని విచారణ చేపట్టారు.

గంజాయి వినియోగిస్తే చర్యలు



మాట్లాడుతున్న అధికారి

నవతెలంగాణ-ఆర్మూర్

అలూర్ మండల కేంద్రంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ గౌడ్ ఆదేశాల మేరకు ఏఎస్ఐ చిన్నయ్య ఆధ్వర్యంలో బుధవారం పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ చిన్నయ్య మాట్లాడుతూ గంజాయి వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, ఇది ఆరోగ్యానికి హానికరమని, చట్టపరంగా నేరమని హెచ్చరించారు. గంజాయి రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద సమాచారం ఉంటే పోలీసులకు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఆలూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, పంచాయతీ కార్యదర్శి రాజలింగం, కరాబర్ సంతోష్,కాంగ్రెస్ నాయకులు సంజీవ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాల కోసం కృషి చేయాలి

- కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి
- శ్రీభాషితలో ఫేర్వెల్ హంగామా



మాట్లాడుతున్న ఎస్ఐ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాల కోసం కృషి చేయాలని కమ్మర్ పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ భాషిత జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థులు, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు పార్టీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్ఐ అనిల్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాల కోసం కృషి చేయాలని, తల్లిదండ్రుల ఆశయాల కోసం కష్టపడి మార్చిలో జరిగే వార్షిక పరీక్షలలో మంచి మార్కులు సాధించాలన్నారు. భవిష్యత్తులో పోటీ పరీక్షలలో పాల్గొని ఉద్యోగాలు సంపాదించి తల్లిదండ్రుల కల నెరవేర్చాలని కోరారు. భవిష్యత్తులో పైకెదిగితే సమాజంలో ఎంతో గౌరవం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు నృత్య ప్రదర్శనతో ఆహుతులను అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, డైరెక్టర్ లు సుంకేట రవి, సిలివెరి సంజీవ్, మలావత్ సంతోష్, లెక్చరర్లు సుమన్, సాయన్న, గజానంద్, శ్రీధర్, శ్రీనివాస్, రాజేష్, శృతి, చైతన్య, అల్పన, రియాన, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అధికారులు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని పలు పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం భోజనాన్ని అధికారులు పరిశీలించారు. మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, ఉర్దూ మీడియం ప్రైమరీ పాఠశాలలో ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, ఆదర్శ పాఠశాలలో ఎంఈఓ బట్టు రాజేశ్వర్ మధ్యాహ్న భోజనాన్ని అల్పాహారాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని వారు సూచించారు. ఎంపీఓ గంగామోహన్, జూనియర్ అసిస్టెంట్ ప్రభాకర్, నిశాంత్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస ప్రసాద్, మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల ప్రిన్సిపల్ చందన, ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు వసింబాను, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్ర శివారులో గల ఊర చెరువులో మూడు రోజుల క్రితం సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంను గుర్తించామని ఎస్ఐ వి.రజనీకాంత్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తి మొహం భాగాన్ని చేపలు కొరకడంతో గుర్తుపట్టలేని విధంగా ఉందని, వయస్సు సుమారు 35 సంవత్సరాలలోపు ఉంటుందని తెలిపారు. తెలుపు, బూడిద రంగు కలిసిన చొక్కా, గోధుమ కలరు ప్యాంటు ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. ముఖం ఛాయలు నలుపు రంగు, పిల్లి గడ్డం వుందని, ఎత్తు అందాద 5.'6' ఉండొచ్చని పేర్కొన్నారు. మృతుని కుడిచెయ్యిపైన ముఖీద్, రవి, సునీల్ అని టాట్ తో రాసిన పేర్లు ఉన్నాయని వెల్లడించారు. ఈ ఆనవాళ్ల ఆధారంగా శవాన్ని ఎవరైనా గుర్తుపట్టినట్లయితే ఈ కింది 8712659859, 8712659863, 9951338132 ఫోన్ నంబర్లకు వెంటనే సమాచారంను అందించాలని సూచించారు. సమాచారం అందిన వెంటనే బాధిత కుటుంబసభ్యులకు ఇట్టి మృతదేహాన్ని అప్పగించడం జరుగుతుందన్నారు..

పది పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచుతాం

- జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్
- పదవ తరగతి అంతర్గత మార్కుల మూల్యాంకనం పరిశీలన
- ఇంటర్నల్ మార్కుల పరిశీలనకు ప్రత్యేక బృందాలు

నవతెలంగాణ-ఆర్మూర్ /బాల్కొండ

పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులను అన్ని విధాలుగా సంసిద్ధం చేస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో ఈ సంవత్సరం ఉత్తీర్ణత శాతాన్ని పెంచుతామని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలిపారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం మున్సిపల్ కమిషనర్ రాజు స్వచ్ఛ సర్వేక్షన్ 2024 కార్యక్రమం నిర్వహించారు. తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని, సింగిల్ యూస్ ప్లాస్టిక్ నివారణ చేయాలని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రాధనోపాధ్యాయులు వనజ, లక్ష్మినర్సయ్య, రామ్ మందిర్ హెచ్ఎం గద్దె గంగాధర్, ఉపాధ్యాయులు కవిత, సానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ పూర్ణమౌళి, విద్యార్థులు పాల్గొన్నారు.

పెర్కిట్ జిల్లా పరిషత్‌లో..

పదవ తరగతి అంతర్గత మూల్యాంకనంలో భాగంగా బుధవారం పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తె.మి.) ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ చీమనుపల్లి పరిశీలించి తనిఖీ చేశారు. సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల అంతర్గత మార్కుల వెరిఫికేషన్ చేశారు. దీనిలో భాగంగా డి.లక్ష్మణ్, కే.రాజ్ కుమార్, ఎం. బాజన్న, సబ్జెక్టుల వారిగా వెరిఫికేషన్ చేసినట్టు తెలిపారు. ఈ వెరిఫికేషన్‌లో ప్రిన్సిపల్ సోమ్లా, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్మూర్ :మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి



బాల్కొండలో..

బాల్కొండ: పదవ తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల పరిశీలన కోసం విద్యాశాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిందని బుధవారం ఎంఈఓ బట్టు రాజేశ్వర్ తెలిపారు. ఎంఈఓ బట్టు రాజేశ్వర్, కిసాన్ నగర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర కుమార్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలు మండల పరిధిలోని వివిధ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ పరిశీలన ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయడానికి తద్వారా వారి అభ్యాసానికి మెరుగైన మార్గదర్శకాలు అందించడానికి వీలుంటుందని ఎంఈఓ తెలిపారు.

ప్రస్తుత విద్య సంవత్సరం 2024-25 నుంచి గ్రేడింగ్ పద్ధతికి బదులుగా మార్కుల రూపంలో పదవ తరగతి ఫలితాలు వెల్లడించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

రైల్వే కనెక్టివిటీ పెరిగితే మరింత అభివృద్ధి

- నిజామాబాద్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ డిస్టిక్ ప్రెసిడెంట్ ఆర్.జగదీశ్వరరావు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ తెలంగాణ ప్రాంతంలో అభివృద్ధి చెందుతున్న నగరాలలో మొదట వరుసలో ఉందని, ఐతే ఇక్కడ రైల్వే కనెక్టివిటీ పెరిగితే మరింత శరవేగంగా అభివృద్ధి చెందుతుందని నిజామాబాద్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ డిస్టిక్ ప్రెసిడెంట్ ఆర్.జగదీశ్వరరావు అన్నారు. ఈ అన్యువల్ సేఫ్టీ ఇన్‌స్పెక్షన్ లో భాగంగా నిజామాబాద్ రైల్వే స్టేషన్‌ను సందర్శించడానికి వచ్చిన సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, డిఆర్‌యం లోకేష్ విష్ణోయిని కలసి బుధవారం వినతి పత్రం అందజేశారు. అధ్యక్షుడు జగదీశ్వర్ రావు మాట్లాడుతూ.. రైల్వే ట్రాక్ డబ్లింగ్, ప్లాట్ ఫామ్‌ల విస్తరణ, మధ్యాహ్నం పీక్ హవర్స్ టైంలో హైదరాబాద్, ముంబై వైపు ట్రెన్ వేయాలని కోరారు. అదే విధంగా ధర్మాబాద్‌లో పార్కింగ్ చేస్తున్న రైళ్ళని నిజామాబాదు వరకు నడపాలని, వందేభారత్ రైళ్లని ఇక్కడి వరకు పొడిగించాలని అన్నారు. ఉత్తరభారత్ పట్టణాలను కలుపుతూ రైళ్ళని నిజామాబాదు మీదుగా నడపాలని సూచించారు. గూడ్స్ షెడ్‌ని వేరే చోటికి తరలించాలని, గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ సమస్యలు పరిష్కరించి వ్యాపారస్థులను ఆదుకోవాలని అన్నారు. అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిలను త్వరితగతిగా పూర్తి చేయాలని, నిజామాబాదు స్టేషన్ సర్వాంగ సుందరంగా తీర్చిదిదాలని కోరారు. పసుపు, వరి రైతులకు సులభంగా తమ పంటను మార్కెట్ కి తరలించడానికి సహకరించాలని కోరారు. రైల్వే బ్రిడ్జి, డబ్లింగ్ పూర్తయితే పైన తెలిపిన అన్ని సమస్యలు పరిష్కరిస్తామని సానుకూలంగా స్పందిస్తూ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కమల్ ఇనాని, సభ్యులు శ్రీనివాస్ రావు, గంగాధర్ రావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు

కంఠేశ్వర్: దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ బుధవారం నిజామాబాద్, బాసర రైల్వే స్టేషన్లలో పర్యటించారు. నూతన నిర్మాణ పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులను నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట స్టేషన్ మేనేజర్ సదాశివ్, ఆర్పీఎఫ్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై ప్రవీణ్, టెక్నికల్ సిబ్బంది తదితరులున్నారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయండి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని సత్లాపూర్ తండలోని సేవలాల్ ఆలయం వద్ద అధికారికంగా ఈ నెల 21న నియోజక వర్గ స్థాయిలో సేవలాల్ జయంతి నిర్వహిస్తున్నట్లు బంజారా నాయకులు మాజీ జెడ్పీటీసీ లత పిర్సింగ్, మాజీ కార్పొరేటర్ రాయ్ సింగ్, అంబు నాయక్, గణపతి నాయక్, దినేష్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజక వర్గ బంజారా నాయకులు, అధికారులు, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.

డ్రంకన్ డ్రైవ్లో పట్టుబడిన ముగ్గురికి జైలు శిక్ష

- 15 మందికి జరిమానా

నవతెలంగాణ-కంఠేశ్వర్

డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన ముగ్గురికి జైలు శిక్ష పడగా 15 మందికి జరిమానా విధించినట్లు నిజామాబాద్ ట్రాఫిక్ సిఐ ప్రసాద్ తెలిపారు. ట్రాఫిక్ సి ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం తాగి వాహనాలు నడిపినటువంటి 18 మందికి ట్రాఫిక్ ఏసిపి టి. నారాయణ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రసాద్ బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ముందర హాజరపరిచారు. 15 మందికి 36200 జరిమానా విధించి, కోటగల్లికి చెందిన శ్రీనివాస్, నిర్మల్‌కు చెందిన ఏం రాజేష్, ఖిల్లా రోడ్‌కు చెందిన ఎండి అఖిల్ వ్యక్తులకు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలి



అడ్మిషన్లపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

ప్రభుత్వ పాఠశాల, కళాశాలలను కాపాడుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్ రెడ్డి, అధ్యాపకులు అన్నారు. మండలంలోని దేవక్కపేట్, గోన్ గోప్పుల, సికింద్రాబాద్ జిల్లా ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు విద్యా అవకాశాలపై ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం 10వ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పదవ తరగతి పూర్తి అయిన తర్వాత ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ తీసుకొని చేరాలని, దీనివల్ల విద్యాభివృద్ధి అవుతుందని విద్యార్థులకు తెలియజేశారు. ఇంతే కాకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ముందంజలో ఉన్నాయని విద్యార్థులకు వివరించారు. ఈ అడ్మిషన్ డ్రైవ్ కార్యక్రమంలో శ్రీనివాస్, సాయికుమార్, సత్యనారాయణ అధ్యాపకులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న సిపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

నవతెలంగాణ-మాక్లూర్

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని ఈనెల 20న చేపట్టిన చలో హైదరాబాదును విజయవంతం చేయాలని సిపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మాకులూరు మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయి రెడ్డి డిమాండ్ చేశారు. బుదవారం మండలంలోని బోర్గం (కే) గ్రామంలో చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "పేస్విటి నుండి భారీ ప్రదర్శన ఇందిరాపార్కులో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ బహిరంగ సభలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు. ప్రభుత్వ ఇచ్చిన హామీల పరిష్కారం అయ్యేంతవరకు ప్రజలు పోరాడాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు సిర్రం శంకర్, ఇ. శ్రీనివాస్ రెడ్డి, దేశెట్టి రాధా, సరోజన, లత , భాగ్య , తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులుగా సుద్దులం సునీల్ నియామకం

నవతెలంగాణ-భీంగల్ రూరల్

అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు గా బడా భీంగల్ గ్రామానికి చెందిన సుద్దులం సునీల్‌ను నియమించారు. అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు డి లింగన్న మాల, నియోజకవర్గ ఇన్చార్జీలు సుద్దులం సునీల్‌ను నియమించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ తనను నమ్మి మండల అధ్యక్ష బాధ్యతలు ఇచ్చినందుకు జిల్లా అధ్యక్షులు లింగన్న, నియోజవర్గ ఇంచార్జీ లకు కృతజ్ఞతలు తెలిపారు. మలాల హక్కుల కొరకు పోరాడుతానని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి జిన్నా జనార్ధన్, మోర్తాడ్ మండల అధ్యక్షులు అంగులి మాల, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల సంరక్షణకు షెడ్ నెట్లు ఏర్పాటు చేయాలి

- దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలి
- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం నర్సరీల సంరక్షణ, షెడ్ నెట్ ఏర్పాట్లపై ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నర్సరీల సంరక్షణ, షెడ్ నెట్ ఏర్పాట్లపై పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో ఎంపీడీవో సమీక్షించారు. వేసవి ఎండలు ముదురుతున్నందున ఆయా గ్రామాల్లో నర్సరీల నిర్వహణకు సంబంధించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నర్సరీ మొక్కల సంరక్షణ కోసం షెడ్ నెట్ లను ఏర్పాటు చేయాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. వేసవి పూర్తయ్య వరకు నర్సరీలో ఉన్న మొక్కలకు ఉదయం సాయంత్రం నీటిని అందించాలన్నారు. గతంలో నాటిన మొక్కల సంరక్షణ కూడా తగిన జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో ఈజీఎస్ పనుల నిర్వహణపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి లేబర్ టర్న్ అవుట్ 35 వచ్చినట్లుగా తెలిపారు. గ్రామాల్లో 100శాతం పన్నుల వసూలుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. శానిటేషన్ నిర్వహణలో భాగంగా దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంలో మోడల్ కోడ్ సంరక్షించన, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక, ఆయగ్రామంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులపై సమావేశంలో సమీక్షించారు.కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సదాశివ్, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, పాల్గొన్నారు.

మధ్యాహ్నం భోజనం పరిశీలన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్, మండల విద్యాధికారి ఆంధ్రయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల కోసం వండి సిద్ధం చేసిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం ప్రతిరోజు ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్, మండల విద్యాధికారి ఆంధ్రయ్య మధ్యాహ్న భోజనం తిని రుచి చూశారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. మధ్యాహ్న భోజనం కోసం అందించే సరుకుల్లో నాణ్యత లోపిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఆయన పాఠశాల రికార్డులను పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన ఎంపీడీవో శ్రీనివాస్ విద్యార్థినీలతో ముచ్చటించారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

- కాంతి హైస్కూల్లో ఘనంగా వీడ్కోలు సంబరాలు
- డ్యాన్సులతో అలరించిన విద్యార్థులు



నవతెలంగాణ-ఆర్మూర్

మునిసిపల్ పరి ధిలోని పెర్కిట్లోగల కాంతి హై స్కూల్ లో బుధవారం ఘనంగా తొమ్మిదవ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ గంగారెడ్డి డైరెక్టర్ హిమారాణి , శశాంక్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలతో అలరించారు. పాఠశాలతో ఫౌండర్ గంగారెడ్డి డైరెక్టర్ శశాంక్ ఉపాధ్యాయులతో వారికున్న అనుభవాలను పంచుకొని ఎంతో భావోద్వేగానికి గురయ్యారు. ప్రతి ఒక్కరూ మంచి మార్కులతో పదవ తరగతి పరీక్షలో ఉత్తీర్ణులమవుతామని తెలియజేశారు. పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులను, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను వారి సేవలకు మార్గదర్శకత్వానికి కృతజ్ఞతగా బహుమతులతో, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కాంతి గంగారెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష రాసే విధానంలో కొన్ని మెలకువలు వివరించారు. ప్రతి ఒక్కరు కూడా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, ఈ పదవ తరగతి తరువాత విద్యార్థి దశ మలుపు తిరుగుతుందని, ఆ మలుపు భావితరాలకు ఆదర్శంగా ఉండాలని తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
గురువారం | ఫిబ్రవరి 20, 2025 | www.navatelangana.com

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి



నవతెలంగాణ-గాంధారి

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని నాయకులు అన్నారు. బుధవారం మండలంలోని గండిపేట్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ తరపున ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి వుట్కూరి నరేందర్ రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి పరమేశ్వర్, పిఏసిఎస్ చైర్మన్ సాయికుమార్, కందాలి మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, గండివెట్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సాయి బాబా, మాజీ ఎంపీటీసీ బుసా శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మొరం రోడ్డు పనులు పరిశీలన



నవతెలంగాణ-బోధన్

మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న మొరం రోడ్డు పనులను పంచాయతీరాజ్ ఏఈ నిఖిత బుధవారం పరిశీలించారు. ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నిధుల ద్వారా మొరం రోడ్డు పనులకు రూ.10 లక్షలు, నూతన అంగన్వాడీ భవన నిర్మాణానికి రూ.12 లక్షలు మంజూరైనట్టు ఏఈ నిఖిత తెలిపారు. ఊట్‌పల్లి నుంచి ఎరాజ్‌పల్లి-మంగల్‌పాడ్ లింక్ రోడ్డు వరకు కొనసాగుతున్న మొరం రోడ్డు నిర్మాణ పనులను, నూతన అంగన్వాడీ భవన నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చేయి

- జీఎస్టీ పేరుతో తెలంగాణ ప్రజలపై పన్నుల భారం
- మా నిధులు మాకివ్వాలి
- ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్(కోటగిరి)

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా యావత్ తెలంగాణ ప్రజానీకానికి కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని కార్మిక నేత నన్నేసాబ్ విమర్శించారు. బుధవారం కోటగిరి మండల కేంద్రంలో కేంద్ర బడ్జెట్ ఎవరికి ప్రయోజనం అనే అంశం మీద ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల నుండి జీఎస్టీ పేరుతో పన్నులు వసూలు చేసే కేంద్ర ప్రభుత్వం మా నిధులు మాకేందుకు ఇవ్వడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో 8 మంది బీజేపీ ఎంపీలున్న నోరు మూసుకొని తమాషా చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే బీజేపీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో జాతీయ పసుపు బోర్డు, జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం, బోధన్ నుంచి బీదర్ వరకు రైల్వే లైన్, నిజాంషుగర్ ఫ్యాక్టరీ పలు అభివృద్ధి పనులకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించనందుకు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ జిల్లా ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ సవరించి, తెలంగాణకు నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు గంగాధరప్పా, నాగనాథ్, లక్ష్మణ్, లింగామణి, సమత, హన్మండ్లు, సాయిలు, చాంద్‌పాషా, నాగరాజు, లక్ష్మి, సావిత్రి, కార్మికులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న నన్నేసాబ్

తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి

నవతెలంగాణ-భిక్కనూర్

టోల్ ప్లాజా నుంచి తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని నూతన కాంట్రాక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజా ఇటీవల కాలంలో నూతన కాంట్రాక్టర్ గతంలో పనిచేసిన కొందరు ఉద్యోగులను తొలగించారు. బుధవారం తొలగించిన ఉద్యోగులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా టోల్ ప్లాజాలో విధులు నిర్వహిస్తున్నామని, తొలగిస్తే ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. వెంటనే తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా నుంచి తొలగించిన ఉద్యోగులు ఉన్నారు.

ప్రతి కూలీకి పని కల్పించాలి

- ఎంపీడీవో నరేష్



గ్రామీణ ఉపాధిలో పాల్గొన్న కూలీలు

నవతెలంగాణ-లింగంపేట్

జాతీయ గ్రామీణ ఉపాధిలో భాగంగా చేపడుతున్న పనుల్లో ప్రతికూలీకి పని కల్పించాలని ఎంపీడీవో నరేష్ క్షేత్ర సహాయకులకు సూచించారు. బుధవారం మండలంలోని శెట్టిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీల సంఖ్యను పెంచాలన్నారు. ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా తాగునీటి సౌకర్యాన్ని కూలీలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. మొక్కలు వాడిపోకుండా చూడాలన్నారు. రోజువారీగా క్షేత్ర సహాయకులు నర్సరీని పర్యవేక్షించాలన్నారు. కూలీల మస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట క్షేత్ర సహాయకులు శివరాం, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రకు తరలిన విద్యార్థులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసి) హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు బుధవారం హైదరాబాద్ నగరంలోని పర్యాటక ప్రాంతాలను వీక్షించడానికి తరలివెళ్లారు. హైదరాబాద్ నగరంలోని సాలార్జంగ్ మ్యూజియాన్ని సందర్శించి అందులోని రాజుల కాలం నాటి వస్తు ప్రదర్శనను తిలకించారు. పురాతన కాలం నాటి వస్తువులను చూసి ఉపాధ్యాయులతో వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం నెహ్రూ జూపార్క్‌లో జంతు ప్రదర్శనలను సందర్శించి వివిధ రకాల జంతువులను తిలకించారు. అనంతరం గోల్కొండ కోటలోని ప్రాంతాన్ని పరిశీలించి, ఆనాటి కట్టడాలను కోట చరిత్రను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సుమారు 400 మంది విద్యార్థులు వాహనాలలో తరలివెళ్లారు. వారి వెంట ప్రధానోపాధ్యాయులు బాలచంద్రం, ఉపాధ్యాయులు రామ్మోహన్, వెంకట్, కృష్ణ, స్నేహ, కళ్యాణి, జ్యోతి, అఫ్సాన్ మహేజాబిన్, అర్షద్, ఖైరాన్, కామేశ్వరీ, రాజ్యలక్ష్మి, ప్రసన్న, రాజన్న తదితరులు ఉన్నారు.

క్షేత్రస్థాయి అవగాహన కోసం.. అటవీ ప్రాంతానికి విద్యార్థినీలు

నవతెలంగాణ-తాడ్వాయి

అటవీ క్షేత్రస్థాయి అవగాహన కోసం అటవీ ప్రాంతానికి బుధవారం వెళ్లినట్లు ప్రిన్సిపాల్ శిరీష తెలిపారు. విద్యార్థిని దశ నుంచి అటవీ ప్రాంతంలో విషయాలు తెలుసుకునేందుకు అటవీ అధికారులతో మంచిప్ప అటవీ ప్రాంతానికి వెళ్లామని వివరించారు. వన్యప్రాణుల తాగునీటి కోసం ఏర్పాటు చేసిన సాసర్ పీట్లను ఎఫ్ఎస్ఓ జి.శ్రీధర్ రావు, ఎఫ్‌బిఓ గోపాల్‌రావుతో కలిసి పరిశీలించామని తెలిపారు. విలువైన టేకు తదితర వృక్షాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారని తెలిపారు. అటవీ జంతువులను పట్టుకునేందుకు ఉపయోగించే బోను సైతం వివరించగా విద్యార్థులు పూర్తిస్థాయిలో తెలుసుకున్నారని పేర్కొన్నారు. అనంతరం మాచారెడ్డి అటవీ ప్రాంతంలో గల లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్శనలో ఐదవ, ఆరవ, పదో తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినీలు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వప్న, మంజులరాణి, హిందూజా, ఉజ్వల, రాజు, ఉపాధ్యాయుని బృందం అటవీ అధికారులు దీపిక, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయి అవగాహన కోసం అటవీ ప్రాంతానికి వచ్చిన విద్యార్థినిలు

అంకితభావం, క్రమశిక్షణతో చదివితేనే ఉత్తమ ఫలితాలు

- ఎంఈవో కట్టా ఆంజనేయులు

నవతెలంగాణ-రెంజల్



పదవ తరగతి విద్యార్థులు అంకిత భావం, క్రమశిక్షణతో చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని మండల విద్యాశాఖ అధికారి కట్టా ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా సమయపాలన పాటిస్తూ, విద్యార్థులు పౌష్టికాహారాన్ని తీసుకున్నప్పుడే వారికి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉత్తమ ర్యాంకులను సాధించాలని పదవ తరగతి విద్యార్థులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు మండల కార్యదర్శి కిషోర్ కుమార్, వీరన్నగుట్ట పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్, సీనియర్ ఉపాధ్యాయులు వి.గంగాధర్, భూమాయప్ప, తదితరులు పాల్గొన్నారు.



మురికి కాలువ శుభ్రం చేసే పనులు పరిశీలిస్తున్న డిపిఓ

రంగంపేటలో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలి

- సౌత్ రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌కు వినతి

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రంగంపేటలో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌కు బుధవారం వినతిపత్రాన్ని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గిరెడ్డి మహేందర్ రెడ్డిలు అందజేశారు. అంతకుముందు ఆయనకు శాలువాతో సన్మానించి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో 2019లో గత జిఎం గజానాన్ మాల్యాకూ వినతిపత్రం అందజేశామని, ప్రజా సౌకర్యార్థం స్టేషన్ ఏర్పాటు చేసి ప్యాసింజర్ రైళ్లను ఆగేవిధంగా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, సురేందర్ సింగ్, మహమ్మద్ అనీఫ్, గోకుల్ తాండ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్వాయి గురుకులంలో "మ్యాథ్స్ రంగోలి"

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఉప్పల్వాయి సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో బుధవారం పీఎం శ్రీ పథకంలో భాగంగా మ్యాథ్స్ సర్కిల్లో "మ్యాథ్స్ రంగోలి" కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులను మూడు సర్కిల్‌గా విభజించి ప్రతి సర్కిల్లో 25 మంది విద్యార్థులతో పోటీలు నిర్వహించారు. మొదటి సర్కిల్ విద్యార్థులు బహుమతి గెలుపొందినట్లు ప్రిన్సిపాల్ శివరాం సింగ్ తెలిపారు. కార్యక్రమంలో గణిత విభాగం ఉపాధ్యాయులు మెగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ ఎస్సైగా వెంకట్ రావు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ ఎస్సైగా వెంకట్రావు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన నసుర్లాబాద్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించి పదోన్నతిపై లింగంపేట్ ఎస్సైగా వచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆయన సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మండలంలోని శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన అరుణ్ కుమార్, సుధాకర్లు ఏసీబీకి పట్టుబడ్డారు. నెల రోజులుగా లింగంపేట్ ఏఎస్ఐ ప్రకాష్ విధులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశానుసారం వెంకట్రావు ఎస్ఐగా ఎట్టకేలకు బాధ్యతలను చేపట్టారు. పోలీసులు ప్రజలతో మమేకం కావాలని ఆయన సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలకు ప్రజాప్రతినిధులు మండల ప్రజలు సహకరించాలన్నారు.

గ్రామంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలి

నవతెలంగాణ-దోమకొండ(బీబీపేట్)

గ్రామాలలో ఎలాంటి సమస్య లేకుండా పంచాయతీ కార్యదర్శులు, అధికారులు చూడాలని డిపిఓ శ్రీనివాసరావు అన్నారు. బిబిపేట మండల కేంద్రంలోని నర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్, శానిటేషన్ పనులు, ఉపాధి హామీ కూలీ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిపిఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు నిబంధన ప్రకారం చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ ద్వారా కూలీలకు పని కల్పించాలని, హాజరు ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని సూచించారు. నర్సరీలోని మొక్కలు, అవెన్యూ ప్లాంటేషన్, నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. గ్రామలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని, గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని తెలిపారు. గ్రామంలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణ చంద్రోదయ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజు, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో పిల్లలను చేర్పించండి

నవతెలంగాణ-లింగంపేట్

పదవ తరగతి పూర్తయిన విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని లెక్చరర్లు పదోతరగతి విద్యార్థులకు సూచించారు. బుధవారం మండలంలోని శెట్పల్లి, శెట్పల్లి సంగారెడ్డి, పర్మల్ల ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్‌కు ధీటుగా బోధన చేపడుతున్నట్టు తెలిపారు. కళాశాల అధ్యాపకులు స్వామి, శ్రీకాంత్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

- ఎంపీడీవో రఘురాం

నవతెలంగాణ-రాజంపేట్(భిక్కనూర్)

పోలింగ్ కేంద్రాల్లో అన్నీ సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో రఘురాం అన్నారు. బుధవారం రాజంపేట్ మండలంలోని శివాయిపల్లి, ఆరెపల్లి, తలమడ్ల, పొందుర్తి, రాజంపేట్ ఆయా గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ్, ప్రశాంత్, రామక్రిష్ణ, రాజు, ఆశోక్, పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించిన తహసీల్దార్

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలను తహసిల్దార్ శ్రావణ్ కుమార్ బుధవారం అకస్మికంగా తనిఖీలు చేపట్టారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయురాలను ఆదేశించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యంలో పురుగులు లేకుండా శుభ్రం చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. మెస్ చార్జీలను 40 శాతం పెంచడం వల్ల విద్యార్థులకు పౌష్టికరమైన భోజనాన్ని అందించాలన్నారు. వారంకోమారు వైద్య సిబ్బందితో వైద్య సేవలను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ఆయన స్వయంగా భోజనాన్ని వడ్డించారు. ఆయన వెంట పాఠశాల ప్రిన్సిపాల్ హర్సియా నాజాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రామారెడ్డి : ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేసిన నాయకులు



పెద్దకొడప్‌గల్‌లో...



తాడ్వాయిలో...



జుక్కల్‌లో...

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

- ఘనంగా జయంతి వేడుకలు
- విగ్రహానికి పూలమాల వేసి నివాళి

నవతెలంగాణ-విలేకరుల బృందం

యువత ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పలువురు పిలుపునిచ్చారు. బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి, విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం పలువురు ఆయన సేవలను కొనియాడారు.

గాంధారి : మండలంలోని మాధవపల్లి గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆర్య క్షత్రియ సంఘం సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ : ఎడపల్లి మండలంలోని జానకంపేట్, తానాకలాన్, ఏఆర్‌పి క్యాంప్, తదితర గ్రామాలలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జానకంపేటలో కిషోర్, పద్మశాలి నరసయ్య, ఉప్పు సురేష్, వీరభద్ర రాజు, సుమన్, ధనుంజయ్ పంతులు, మంద సంజీవ్ కుమార్, తానాకాలంలో సూర కిరణ్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో మల్లెపూల శ్రీనివాస్, లక్ష్మణ్ గౌడ్, పేట గంగాధర్, సాయి, హిందూ వాహిని యువకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పొతంగల్ : మండలంలోని హంగర్గ బీసీ కాలనీలోని ఛత్రపతి శివాజీ చౌక్ వద్ద, శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రెంజల్ : మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మర్ల షికారి రమేష్ కుమార్, మెట్టు రంజిత్ కుమార్, ఈర్ల రాజు, గాలి పల్లి శ్రీనివాస్, ఆసాని అనిల్, కురుమే శ్రీనివాస్, లక్ష్మణ్ గౌడ్, రాఖి, ఏ నవీన్, డి కళ్యాణ్, నవీన్, మల్లెపూల రఘు, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి : మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివాజీ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ : మండలంలోని పలు గ్రామాలలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు యువజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగల్‌గావ్, ఖండేబల్లూర్, కంటాలి, బిజ్జాల్వాడి, దోస్పల్లి, చండేగావ్, హంగర్గా, పెద్దఎడ్గి, చిన్నఎడ్గి, గుండూర్ గ్రామంలో నిర్వహించారు.

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంతో పాటు అంజని జగ్నాథ్‌పల్లి, వడ్లం, పలు గ్రామాలలో శివాజీ జయంతి వేడుకలను బజరంగ్‌దళ్ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.

తాడ్వాయి : ఆర్య క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. అలంకరించిన వాహనంలో విగ్రహాన్ని ఉంచి ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. అనంతరం జెండా ఆవిష్కరణ చేసి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్య క్షత్రియ సంగం అధ్యక్షులు జంగల్‌దేమీ రామచంద్రరావు, మాజీ సర్పంచ్ బండారు సంజీవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటరెడ్డి, మాజీ సిడిసి చైర్మన్ మద్ది మహేందర్‌రెడ్డి, ఎస్సై వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఆర్ రాజాగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అంటీర్ శ్యామ్ రావు, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు, తదితరులు పాల్గొన్నారు.

పోతంగల్ : మండలంలో సోంపూర్ గ్రామంలోని ఎంఆర్‌పిఎస్ యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నిజామాబాద్ సహాయ కార్యదర్శి సోంపూర్ పోచిరాం, గ్రామ పెద్దలు సిందే గంగారాం, కందారే మాధవరావు, యువకులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

బోధన్ : ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను బోధన్, సాలూర మండలాల్లో హిందు సంఘాల ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గల శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ సేన, శివాజీ మహారాజ్ విగ్రహ వ్యవస్థాపకుడు పసుపులేటి గోపి కిషన్, మాజీ మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి శరత్‌రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గంగాధర్ పట్వారి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె కాలపు వేతనాలు విడుదల చేయాలి

- డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.బాలయ్య

నవతెలంగాణ-భీంగల్ రూరల్

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు వేతనాలు వెంటనే విడుదల చేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు బాలయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో సమగ్ర శిక్ష పరిధిలో పని చేస్తున్న అందరూ 29 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొన్నారని తెలిపారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని చర్చలు కొనసాగించి సమ్మె విరమించుకోవడం జరిగిందని సూచించారు. నాడు ప్రభుత్వ మంత్రులు చెప్పిన విధంగా సమ్మె కాలపు వేతనాలు వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు.

గాంధారి కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

- గాంధారికి చెందిన బంజ నాగయ్య వారసులు

నవతెలంగాణ-కామారెడ్డి



గాంధారి కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గాంధారికి చెందిన బంజ నాగయ్య వారసులు డిమాండ్ చేశారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బంజ నాగయ్య మనమళ్లు అయిన బంజ శంకరప్ప, బంజా సంగప్ప, బంజ రాజప్ప మాట్లాడారు. ఆ వెంచర్కు పర్మిషన్ ఉందా లేదా అని పర్మిషన్ లేకుంటే దానిని నిలిపివేయాలని కార్యదర్శిని కోరగా తమపైనే పోలీస్ కేసు పెడతానని గాంధారి కార్యదర్శి నాగరాజు బెదిరించాడని తెలిపారు. తప్పుడు అసెస్మెంట్ నెంబర్ ఇచ్చిన దానిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి హైదరాబాద్ నగరంలో బిజెపి ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సాల్ ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల గురించి ఆయనతో చర్చించారు. పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్యారం టోర్నీకి సతీష్, పార్ట్‌నర్ అబ్దుల్ సలీమ్ ఎంపిక



క్యారం టోర్నీలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మహారాష్ట్ర పూణేలోని శివ్ ఛత్రపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 2024-25 గాను ఫిబ్రవరి 17 నుంచి 22 వరకు నిర్వహిస్తున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్యారం టోర్నీకి తెలంగాణ నుంచి భీంగల్ పట్టణ కేంద్రానికి చెందిన నేషనల్ సీనియర్ క్యారం ప్లేయర్ నూతికట్టు సతీష్ (భీంగల్), పార్ట్‌నర్ అబ్దుల్ సలీమ్ (నిజామాబాద్) ఎంపికయ్యారు. టీం వీరు ఛాంపియన్ షిప్‌లో తెలంగాణ జట్టు నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. 17న సిమ్లా రాష్ట్రంతో, 18న హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర క్యారం క్రీడా కారులతో హెూరాహెూరీ తలపడి రెండు రౌండ్లలో తమ సత్తా చాటి విజేతలుగా నిలిచారని భీంగల్ పట్టణ కేంద్రానికి చెందిన సీనియర్ క్యారం ప్లేయర్ కంకణాల రాజేశ్వర్ బుధవారం మీడియా సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడవ రౌండ్‌లో మహారాష్ట్రతో తలపడనున్నారని వివరించారు. అఖిల భారత స్థాయిలో కూడా తమ ప్రత్యేక ప్రతిభా ప్రావీణ్యాన్ని ప్రదర్శించి తెలంగాణ సత్తాను చాటాలని సూచించారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం



ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సిద్దుల గుట్ట మహా శివరాత్రి ఉత్సవాలలో పాల్గొనాలని ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్, చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్‌ను ఉత్సవాల కమిటీ సభ్యులు బుధవారం ఆహ్వానించారు. మహాశివరాత్రి ఉత్సవాలకు కూరగాయలు ఫౌండేషన్ తరపునా సమకూర్చలని తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు చరణ్‌రెడ్డి, భారత్ గ్యాస్ సుమన్, సతీష్, మాజీ కౌన్సిలర్ మురళీ, జిమ్మి రవి, ప్రశాంత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలి

- అధికారులకు సూచించిన ఏసిపి



మాట్లాడుతున్న ఏసిపి వెంకటేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ

ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని ఏసిపి జే. వెంకటేశ్వర్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో ఉన్న మౌలిక వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరా, ర్యాంప్, టాయిలెట్స్ తదితర వసతులను కల్పించాలని తెలిపారు. ఎలాంటి అవంతరాలు లేకుండా ఎన్నికలను సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పదవ తరగతి పరీక్షలు రానున్న నేపథ్యంలో మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ విద్యార్థులలో స్ఫూర్తిని నింపారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.నరేష్, ఎంఈఓ బట్టు రాజేశ్వర్, ఇన్‌చార్జి హెచ్ఎం ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

శివాజీ.. లౌకిక పాలకుడు

- ఛత్రపతి శివాజీ మహారాజ్

395వ జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

నిజామాబాద్ సిటీ : ఛత్రపతి శివాజీ లౌకిక పాలకుడని సీపీఐ నాయకులు అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా బుధవారం రైల్వే స్టేషన్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ కేవలం హిందూ రాజుగా మాత్రమే చిత్రీకరించే విధంగా పాలకులు ప్రయత్నిస్తున్నారన్నారు. కానీ ఛత్రపతి శివాజీ లౌకిక పాలకుడు అన్ని మతాలకు సమానంగా చూస్తూ పాలన చేశారన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పి.సుధాకర్ ఏ రాజేశ్వర్ కే రాజయ్య రంజిత్ ఫిరోజ్ అలీ రాధా కుమార్ పాల్గొన్నారు.

బోర్గంలో శివాజీ విగ్రహావిష్కరణ..

నిజామాబాద్‌నగరంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోర్గం ప్రాంతంలో కొత్తగా ఏర్పాటు చేసిన శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం గాజుల్ పేట్, నాందేవ్‌వాడ శివాజీ చౌక్ వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ శత్రువులను ఎదిరించేలా తల్లి జీజియాబాయి శివాజీని చిన్నతనంనుండే తీర్చిదిద్దారని కొనియాడారు. మొఘలులను ఎదిరించి స్వరాజ్య స్థాపనకు తన ప్రాణాలను అర్పించారని అన్నారు. స్వామి వివేకానంద చెప్పినట్టు "ఉక్కు నరాలు, ఇనుప ఖండరాలు, వజ్ర సంకల్పం" కలిగిన యువతనే భవిష్యత్తు భారతదేశాన్ని నిర్మించగలరన్నారు. కార్యక్రమంలో శివాజీ ఉత్సవ సమితి సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శివాజీ మహారాజ్ సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ముఖ్య అతిథిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి పాల్గొన్నారు.

మోపాల్ : మండలంలోని మంచిప్ప గ్రామంలో గ్రామపెద్దలు, గ్రామ యువకులు శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా దేవా శంకర్ శివాజీ గురించి తెలియజేస్తూ హిందూ హృదయ సామ్రాట్, ధర్మపరిరక్షణలో వీరవిరాట్ 17 ఏళ్లకే శత్రువు వెన్నులో వణుకు పుట్టించిన యోధుడని అన్నారు. మొఘలులు సైతం వెనుకాడే విధంగా లక్ష సైన్యాన్ని తయారు చేసిన సమర్థుడు, 27 ఏళ్ళపాటు యుద్ధభూమిలో వెన్నుచూపని శత్రుభయంకరుడని అన్నారు. 300 కోటలకు అధిపతి మూడువేల ఏళ్లయినా తగ్గని శివాజీ ఖ్యాతి మేరు నగధీరుడు, మరాఠయోధుడు ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు రాజేష్ మాజీ ఎంపిటిసి వెంకట్రామ్, అమ్రాబాద్ రవి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ : మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. మార్కెట్ యార్డులోని నూతనంగా నిర్మించిన శివాజీ విగ్రహానికి పూలమాలలు వేస్తూ బీజేపీ, భజరంగ్ దళ్, యువజన సంఘం నాయకులు వేర్వేరుగా జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయకుడు సంతోష్ కుమార్, బీజేపీ మండల అధ్యక్షులు గడ్డం సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ వేడుకలు

డిచ్‌పల్లి : ఇందల్ వాయి మండలంలోని ఇందల్ వాయి గ్రామంలో గ్రామ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు పాలాభిషేకం చేశారు. కార్యక్రమం లో యువజన సంఘాల నాయకులు లోకాని గోపీ, అశోక్, రవి, కుమార్, సాయి, రణవీర్, నిఖిల్, నరసింహ, శ్రీకర్ ,మధు, వసంత్, రాకేష్, శ్రీకాంత్, శేఖర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట్ : మండల కేంద్రంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో సాటాపూర్ చౌరస్తాలో విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. యంచ, అభంగపట్నం, జన్నేపల్లి తదితర గ్రామాలలో జయంతి వేడుకలను నిర్వహించారు.

నిజామాబాద్ సిటీ : ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ నాయకులు సాయి, మనోజు కృష్ణ, సాయి, కిరణ్, పవన్, ప్రవీణ్, కిషన్, తదితదిరులు పాల్గొన్నారు.

బ్రిలియంట్ హైస్కూల్లో...

నిజామాబాద్ సిటీ : జిల్లా కేంద్రంలో అంబేద్కర్ కాలనీలోగల బ్రిలియంట్ హై స్కూల్ విద్యార్థులు ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని స్కూల్ నుండి శివాజీ చౌక్ వరకు ర్యాలీగా నిర్వహించారు. శివాజీ వేషధారణలో విద్యార్థులు అలరించారు. ఛత్రపతి శివాజీ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కేసరి రాజేంద్రప్రసాద్, టీచర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : ఛత్రపతి శివాజీ వారసత్వాన్ని కొంసాగించాల్సిన ఆవశ్యకత ఉన్నదని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ అన్నారు. ఛత్రపతి జయంతి సందర్భంగా బోర్గం(పి)గ్రామ ప్రధాన కూడలిలో గల శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. భారతీయ ఆధ్యాత్మిక విలువలతో కూడిన పరిపాలన అందించిన గొప్ప పరిపాలకుడని ఆయన కొనియాడారు. యువతరం శివాజీ అనుసరించిన అడుగుల్లో అడుగులు వేయండని జగన్మోహన్ ఉద్బోధించారు. కార్యక్రమంలో బార్ ప్రధాన కార్యదర్శి వసంత్ రావు,చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్ కుమార్ సుబేదార్, న్యాయవాదులు ఆశ నారాయణ, పిల్లి శ్రీకాంత్,బాలాజీ ,శివాజీ సేవా సమితి అధ్యక్షుడు లక్ష్మణ్ ,రాజు తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ సిటీ: నివాళ్లు అర్పించిన బ్రిలియంట్ స్కూల్ విద్యార్థులు



మోపాల్‌లో...



నవీపేట్‌లో...

ధర్మసమాజ్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

నవతెలంగాణ-ఆర్మూర్

ధర్మ సమాజ్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని ధర్మ సమాజ్ పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. ధర్మ సమాజ్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిని మంద జ్యోతికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులైన ఓటర్లను కోరారు. బుధవారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఆయన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. ప్రజలను దోపిడి చేసి సంపాదించిన డబ్బు బలంతో లక్షల కోట్ల రూపాయల తో మళ్ళీ శాసన మండల ఎన్నికల్లోకి అగ్రకుల రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపి పార్టీలు పెద్ద పెద్ద గుత్తేదారులు, వ్యాపారులైన రెడ్లకు ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని ఇవ్వడం అత్యంత దారుణమని అన్నారు. నిజంగా కాంగ్రెస్ , బిజెపి పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే వారి అభ్యర్థిత్వాన్ని వెనక్కి తీసుకొని అణగారిన వర్గాల నుంచి ప్రాతినిధ్యం వహించబోతున్న మహిళ మంద జ్యోతికి సంపూర్ణ మద్దతు తెలియజేయాలని అప్పుడే సమానత్వ విధానాన్ని అనుసరించినట్లు అవుతుందని అన్నారు. విద్యా, వైద్యాన్ని వ్యాపారం చేసేటోళ్ల ప్రజలందరికీ ప్రభుత్వ ఆధ్వర్యంలో విద్యా వైద్యం అందించడానికి శాసనమండలిలో ఏ రకంగా మాట్లాడుతారని, ప్రజలను దోచుకోవడం మాత్రమే తెలిసినోళ్ల చట్టసభల్లో ఏమి ప్రాతినిధ్యం వహిస్తారని అన్నారు. అందుకని విద్యావంతులైన వివేకవంతులైన మానవతవాదులందరూ ప్రజాస్వామిక ప్రేమికులు అయినా పట్టభద్రులు మంద జ్యోతికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని, భారత రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలని కోరారు . . కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, సుమన్ ,రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్,జిల్లా అధ్యక్షులు మహిపాల్ గారు, జిల్లా నాయకులు ప్రశాంత్, మురళి, గుర్రం రాజేశ్వర్ గారు, వివిధ మండల అధ్యక్షులు ఉమేష్ , కైలాష్ , నిశాంత్ , మహేష్, కిషన్, కాన్షిరాం, పోషయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మ సమాజ్ పార్టీ అధినేత డాక్టర్ విశారదన్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండలంలోని గుత్ప గ్రామంలో రవీందర్ గౌడ్‌కు ముఖ్యమంత్రి ఆర్థిక సహాయనిధి నుంచి మంజూరైన రూ.36 వేల చెక్కును బుధవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వినయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డికి, నిధులను మంజూరు చేయడంలో కృషి చేసిన నియోజకవర్గ ఇంఛార్జి వినయ్ కుమార్ రెడ్డి,ముక్కెర విజయ్ కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియో జకవర్గ ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు బాశెట్టి శశి కుమార్, మాజీ సర్పంచ్ చిన్న య్య, నాయకులు భూమేశ్వర్, హైమద్, భూమన్న, సంజీవ్ , అశోక్, నాగు, పోషన్న,శోభన్, సతీష్, సాయిలు, రాజేశ్వర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

భారత సేవా రత్న అవార్డు గ్రహీతకు సన్మానం



సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

భారత సేవ రత్న "అవార్డు గ్రహీత సమాజ సేవకుడు, శ్రీ పట్వారీ తులసి కుమార్ ను జిరాయత్ నగర్ స్వగృహంలో ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ బుధవారం ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియడారు. సమాజ సేవకొనసాగిస్తూ మరిన్ని అవార్డులు అందుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గంగా మోహన్ చక్రు, రాం ప్రసాద్, కొండి రాం చందర్ ,విట్టొబా శేఖర్, నారా గౌడ్, దాసరి గోపి, గోపి కృష్ణ, సైఫ్, ముజహిద్, పెంటి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తడి పొడి సాగుపై అవగాహన

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని పల్లికొండ గ్రామంలో డాక్టర్‌రెడ్డిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తడి-పొడి సాగుపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డాక్టర్‌రెడ్డిస్ ఫౌండేషన్ కమ్యూనిటీ ఫెసిలిటేటర్ నోముల మహేందర్ మాట్లాడుతూ.. వరిలో నీటిని ఆదా చేసుకునే పద్ధతులను రైతులు అమలు చేసుకోవాలని తెలిపారు. వరిలో కలుపుకు తొలగించిన తర్వాత పొట్ట దశ వచ్చే సమయం వరకు ఎక్కువ నీరు అవసరం ఉండదని, కేవలం 45 తడులతో తడి పొడి విధానం పాటించి సాగు చేయవచ్చని సూచించారు.



మాట్లాడుతున్న డాక్టర్‌రెడ్డిస్ ఫౌండేషన్ కమ్యూనిటీ ఫెసిలిటేటర్

ఈ పద్ధతి పాటిస్తే నీటి వృధాను అరికట్టడంతో పాటు 15 నుంచి 30శాతం దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కమ్యూనిటీ ఫెసిలిటేటర్ నోముల మహేందర్, గ్రామ రైతులు, దోనకంటి రాజేష్, రాజన్న, నవీన్, శ్రీనివాస్, కిషన్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితర రైతులు పాల్గొన్నారు.

నీరు వృథా కాకుండా యాసంగిలో పంట చివరి దశ వరకు సాగు నీరు అందించవచ్చు..

ఈ విధానంలో 30 సెంటీమీటర్ల ఎడబ్ల్యుడీ పైపును 15 సెంటీమీటర్ల వరకు రెండు సెంటీమీటర్ల ఎడంలో రంధ్రాలు చేసుకొవాలి. జల్లెడ మాదిరి తయారుచేసి దీన్ని పొలం గట్టు నుంచి మీటర్ దూరంలో భూమికి రంధ్రాలు సమాంతరంగా మునిగిపోయేలా అమర్చుకోవాలి. భూ ఉపరితలం నుంచి ఐదు సెంటీమీటర్ల వరకు నీరు కిందకు పడిపోయినప్పుడు, ఐదు సెంటీమీటర్ల మాత్రమే నీటిని అందించాలని తెలిపారు.

డబుల్ కోసం ఎదురుచూపులు

- తుదిమెరుగుల వద్ద నత్తనడకన పనులు

నవతెలంగాణ-ఆర్మూర్

పేదలకు సొంతింటి కల అందని ద్రాక్షగా మారింది. గత ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం కింద ఇళ్లను అందించడానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించి 7,8 సంవత్సరాలు గడుస్తున్న నిర్మాణాలు పూర్తి అయి తుది మెరుగుల దగ్గర నత్త నడకన కొనసాగుతున్నాయి. దీంతో అర్హులైన పేదలు ఇండ్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఒక సంవత్సరం పూర్తి అవుతుంది. ఆరు గ్యారంటీల్లో భాగమైన ఇందిరమ్మ ఇండ్లకోసం ఎదురు చూస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇంటి స్థలంతో పాటు ఐదు లక్షల రూపాయలు అందిస్తామని హామీ నిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన డబుల్ బెడ్ రూమ్‌లపై సంబంధిత నాయకులు, అధికారులు తీసుకునే నిర్ణయంపై ఎదురుచూస్తున్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో...

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించారు. మొత్తం ఆరు నియోజకవర్గాల పరిధిలలో 15 వేల 34 ఇండ్లను మంజూరు చేశారు. వీటిలో బోధన్ నియోజకవర్గంలో 1712, బాన్సువాడ నియోజకవర్గంలో 4,988, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 1564, అర్బన్ నియోజకవర్గంలో 2,330 ఆర్మూర్ నియోజకవర్గంలో 2,130 బాల్కొండ నియోజకవర్గంలో 2,580 ఇండ్లను కేటాయించారు. జిల్లాల ఆరు నియోజకవర్గాల పరిధిలో 9267 ఇండ్లు మొదలుపెట్టగా వీటిలో 6,162 పూర్తి చేశారు. అయితే వీటిలో ఎక్కువ శాతం బాన్సువాడ నియోజకవర్గంలో 354 ఇండ్లను పూర్తి చేయడంతో పాటు లబ్ధిదారులకు కేటాయించారు.

నియోజకవర్గంలో...

ఇండ్లు లేని అద్దె ఇళ్లలో ఉంటూ నరకయాతన అనుభవిస్తున్న పేద మధ్యతరగతి ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సొంతింటి కల నెరవేర్చాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి 2022 దసరా వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన నత్త నడకన పనులు సాగి నిర్మాణాలు పూర్తి అయ్యాయి. పట్టణంతో పాటు మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, పెర్కిట్, మండలంలోని అంకాపూర్ గ్రామాల్లో ఇల్ల నిర్మాణాలను ప్రారంభించారు. పట్టణంలో 160 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా 136 ఇల్లు పూర్తి కావస్తున్నవి. మిగిలినవి అసంతృప్తిగా ఉన్నవి. మామిడిపల్లిలో 100 ఇల్లు పనులు 90 శాతం వరకు పూర్తి అయింది. మండలంలోని అంకాపూర్ గ్రామంలో 165 ఇల్లు నిర్మించాలని సంకల్పించగా 12శాతం ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి అయి కలర్లు సైతం వేశారు. కొన్నిచోట్ల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో పేదల్లో నిరాశ నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇంటనే పేదలకు ఇళ్లను అందించాలని కోరుతున్నారు.



ఇంకా పూర్తి కాని డబుల్ బెడ్‌రూం ఇళ్లు


అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు అందేలా చూస్తా



నియోజకవర్గంలో ఇల్లులేని నిరుపేదలను గుర్తించి అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూమ్‌లు ఇచ్చేందుకు కృషి చేస్తాను.

పైడి రాకేష్ రెడ్డి, ఎమ్మెల్యే, ఆర్మూర్.

ఇండ్లు లేని వారిని గుర్తించి ఇవ్వండి



గత 25 సంవత్సరాల నుండి అద్దె ఇళ్లలో ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అర్హులను గుర్తించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందజేయాలి.

- కళ్యాణి, మామిడిపల్లి.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ డ్రైవ్



నవతెలంగాణ-గాంధారి

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం గంగారంతో పాటు అధ్యాపకులు అడ్మిషన్ డ్రైవ్ బుధవారం నిర్వహించారు. మండలంలోని పెద్ద పోతంగల్, పేట్ సంగెం, చద్మల్ తండా, గాంధారి, గండివేట్, గౌరారం, లింగంపేట మండలం నల్లమడుగు హైస్కూల్‌లలోని విద్యార్థులను కలిసి ఇంటర్‌లో అడ్మిషన్లు పొందాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ తీసుకుంటే మంచి విద్యతో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలు, స్కాలర్‌షిప్ సదుపాయాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో లెక్చరర్లు వెంకటస్వామి, శ్రీధర్ రమేష్, సుజాత, అంజలి, గణేష్ కుమార్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఎమ్మెల్సీ ప్రచారం



నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని ఆయా గ్రామాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రచారం రోజురోజుకూ ఊపందుకుంది. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారంలో బుధవారం పట్టభద్రులైన ఓటర్ల వద్దకు వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటు కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి నరేందర్‌రెడ్డికి వేయాలంటూ ప్రచారం చేశారు. తాడ్వాయి, చిట్యాల్, ఎర్రపాడు, నందివాడ, దేవయ్యపల్లి, గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి, గైని శివాజీ, షౌకత్, కంది విట్టల్, లక్ష్మణరావు, మేకల రాజు, ఆయా గ్రామాల కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ బయోమెట్రిక్‌ను అప్‌డేట్ చేయించాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆయా పాఠశాలల్లోని విద్యార్థులందరి ఆధార్ బయోమెట్రిక్‌ను అప్ డేట్ చేయించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. తద్వారా భవిష్యత్తులో జేఈఈ వంటి పరీక్షలు రాసే సమయంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తవని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. హైదరాబాద్ నుండి వీ.సీ ద్వారా డిప్యూటీ డైరెక్టర్ చైతన్య రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఐదేళ్లలోపు వయస్సు గల చిన్నారులు 61412 మంది, పదిహేను సంవత్సరాల వయస్సు గల వారు 40275 మంది ఆధార్ బయోమెట్రిక్ అప్ డేట్ పెండింగ్‌లో ఉందని డీ.డీ చైతన్యరెడ్డి తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ, జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థుల బయోమెట్రిక్ అప్ డేట్ కు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ను ఆదేశించారు. ఆయా పాఠశాలల వారీగా ముందస్తు సమాచారం అందిస్తూ బయోమెట్రిక్ అప్ డేట్ జరగని విద్యార్థులతో అప్ డేట్ చేయించాలన్నారు. ముందుగా నిజామాబాద్ నగరంలోని పాఠశాలల్లో ఈ ప్రక్రియను వెంటనే చేపట్టాలని, నెల రోజుల వ్యవధిలో అన్ని పాఠశాలల్లో విద్యార్థులందరి బయోమెట్రిక్ అప్డేట్ జరిగేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. కాగా, అప్పుడే పుట్టిన శిశువు మొదలుకుని ఐదేళ్ల లోపు చిన్నారులందరికి తప్పనిసరిగా తల్లిదండ్రులు ఆధార్ నమోదు చేసేలా జిల్లా యంత్రాంగం తరపున చొరవ చూపాలని డిప్యూటీ డైరెక్టర్ చైతన్య రెడ్డి కలెక్టర్ ను కోరారు. ఆధార్ సేవలలో సాంకేతిక సమస్యలు, ఇతర ఇబ్బందులను పరిష్కరించేందుకు జిల్లాలో మెగా క్యాంపు నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఈ.డీఎం కార్తీక్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, లీడ్ బ్యాంకు మేనేజర్ అశోక్ చౌహన్, డీడబ్ల్యూఓ రసూల్ బీ, డీఎస్సీడీఓ నిర్మల, పోస్టల్ అధికారి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

తలసేమియా వ్యాధి చికిత్సకు రాజీవ్ ఆరోగ్య శ్రీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిజామాబాద్‌లో తలసేమియా వ్యాధి చికిత్సకు రాజీవ్ ఆరోగ్యశ్రీ వర్తింపు జరిగిందని జిల్లా చైర్మన్, రెడ్‌క్రాస్ సొసైటీ బుస్స ఆంజనేయులు బుధవారం ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచే ఆరోగ్యశ్రీ నియమాలమేరకు మాత్రమే చికిత్స ఉంటుంది. (పేషంట్స్ రేషన్ కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరి) తెలిపారు. ప్రస్తుతం మంగళ, గురు, శని వారాల్లో చికిత్స ఉంటుందని సూచించారు. తదుపరి సంఖ్య పెరిగినప్పుడు ప్రతిరోజు ఉండే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పుడు తలసేమియా వ్యాధి గ్రస్తులకు ప్రతి 20 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించవలసి ఉంటుందని, రక్త సేకరణకు ఎక్కువ రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేసి రక్త సేకరణ చేసి ప్రాణాలు కాపాడుదామని తెలిపారు.

పట్టభద్రుల ఎన్నికల్లో ఆచీతూచీ ఓటు వేయాలి

జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-పిట్లం

పట్టభద్రుల ఎన్నికలు ఫిబ్రవరి 27న నిర్వహించనున్న నేపథ్యంలో ఆచీతూచీ ఓటు వేయాలని స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్ జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెదక్-ఉమ్మడి నిజామాబాద్ - ఆదిలాబాద్- కరీంనగర్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అల్ఫోర్స్ డాక్టర్ వుట్కూరి నరేందర్‌రెడ్డికి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. నరేందర్‌రెడ్డి మంచి విద్యావేత్త, సామాజిక వేత్తగా పలు సేవా కార్యక్రమాలు చేస్తూ సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. ఎంతోమంది పేద విద్యార్థులకు తన విద్యా సంస్థలలో ఉచిత విద్యను అందిస్తున్న ఘనత ఆయనదేనని అన్నారు. శాసనమండలిలో పట్టభద్రుల తరఫున గళం వినిపించడమే కాకుండా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. అందుకుగాను పట్టభద్రులు ఆయనకు ఓటు వేసి పట్టం కట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్, డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, జిల్లాలోని ఆయా నియోజకవర్గాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ దారుణహత్య

- నిందితున్ని పట్టుకుని రిమాండ్‌కు పంపిన పోలీసులు

నవతెలంగాణ-ఏర్గట్ల



వివరాలను వెల్లడిస్తున్న సీఐ

మండలంలోని నాగేంద్ర నగర్ గ్రామానికి చెందిన ఆశ వర్కర్ కొండ లక్ష్మీ దారుణ హత్యకు గురైంది. భీంగల్ సిఐ పొన్నం సత్యనారాయణ, ఏర్గట్ల ఎస్సై బి.రాము తెలిపిన వివరాల ప్రకారం.. నాగేంద్ర నగర్ గ్రామానికి చెందిన కొండ లక్ష్మీ అనే ఆశవర్కర్ గత నెల జనవరి 21 నుండి కనబడటం లేదని ఆమె కూతురు మరుసటిరోజు 22న ఏర్గట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా పొన్కల్ గ్రామం, మామడ మండలం, నిర్మల్ జిల్లాకు చెందిన మేస్త్రి పనిచేసుకునే కుంచపు వెంకటేష్‌తో లక్ష్మికి పరిచయం ఏర్పడింది. నిందితుడు ఆమెకు మాయమాటలు చెప్పి గత నెల జనవరి 21న మామడకు పిలుచుకున్నాడు. అక్కడి నుండి దిమ్మదుర్తి, నల్దుర్తి మధ్య గల అడివిలోకి తీసుకువెళ్లాడు. అతి దారుణంగా హత్యచేశాడని, నిందితుడిని పట్టుకుని విచారించి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలి

- రోడ్డు భద్రత క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ



రోడ్డుభద్రత క్యూఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని డా.శ్రీశైలం సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నలంద పాఠశాలలో పిల్లల వైద్యుల సంఘం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరించి, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డా.శ్రీశైలం మాట్లాడుతూ.. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదని తెలిపారు. సీట్‌బెల్ట్ ఉపయోగించకపోవడం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తున్నాయని పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పాటు ఇతరులకు కూడా చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపే రవీందర్, నలంద పాఠశాల చైర్మన్, రెడ్‌క్రాస్ నిజామాబాద్ డివిజన్ వైస్ చైర్మన్ మురళీకృష్ణ, డైరెక్టర్ ఇంగు నేహా, ప్రిన్సిపల్ తనుజ, ఐఏపీ కార్యదర్శి శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని పురాణీపేట్ గ్రామంలో సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారు వడ్డేమ్ సత్య గంగుకు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సీఎం సహాయ నిధి ద్వారా ప్రజలకు సహాయం చేస్తూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు సీరం అనూసాగర్, దైడి సురేష్, తోట శివ క్రాంతి, తోట గణేష్, మొండి హరీష్, సీరం చిన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా
మైనారిటీ గురుకుల పాఠశాలల్లో మెరుగైన విద్య

- ప్రిన్సిపాల్ సయ్యదా అర్షి ఇక్బాల్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ మైనారిటీ గురుకుల పాఠశాలలలో మెరుగైన విద్య తోపాటు అన్ని రంగాల్లో విద్యార్థులకు తీర్చిదిద్దుతున్నామని, ప్రభుత్వం గురుకుల పాఠశాలల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నదని మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సయ్యదా అర్షి ఇక్బాల్ స్పష్టం చేశారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఘన్‌పూర్ శివారు లోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు గురువులను ఘనంగా సన్మానించారు. గురుకుల పాఠశాలలో తాము గడిపిన ఎనిమిదేళ్లను నెమరు వేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు డ్రామాలు చేసి, పాటలు పాడి, ఆటపాటలతో కనువిందు చేశారు. గురువులు తమ తమ అనుభవాలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సయ్యదా అర్షి ఇక్బాల్ మాట్లాడుతూ.. పరీక్షలు బాగా రాసి ఉన్నత స్థాయికి ఎదగాలని, మంచి స్నేహితులను మంచి అలవాట్లను, అలవర్చుకోవాలని ఒక లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష సాధనకు కృషి చేయాలన్నారు. ఇంటర్మీడియట్ అనేది మొదటి మెట్టని, దీని తర్వాత ఉన్నత విద్య కోసం అనేక మార్గాలు ఉన్నాయని, ఒక మార్గాన్ని ఎంచుకొని తమ లక్ష్యాన్ని సాధించి సమాజానికి ఉపయోగపడాలని ఆమె కోరారు.

కార్యక్రమంలో అధ్యాపకులు జి శ్వేత, ఎస్ ప్రసాద్, కే స్వాతి, సయ్యద్ లయిక్, ప్రణీత్ రెడ్డి, పి సంతోష్ కుమార్, బి వంశీకృష్ణ, ఎం సుచిత్ర, ఎస్ శ్రీకాంత్, స్రవంతి, సువర్ణ లత, శోభారాణి, మధు,ఎం రవీందర్, టాటానంద్, మధుసూదన్, ఎండి మజార్ హుస్సేన్, జి వినోద, ఎంఎ హమీద్ ఫారూఖ్, మంజుల రాజారామ్, సాదియా సనోబర్, కే నరేష్, షేక్ ఫరూక్, మొహమ్మద్ సత్తార్, కే వినోద్, ఫెరోస్ ఖాన్, గాయత్రి, మీనా టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ఆడపిల్లలను చదివించాలి



నవతెలంగాణ- నవీపేట్

మండలంలోని మట్టయ్య ఫారం గ్రామ పంచాయతీలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో భేటీ బచావో.. బేటి పడావో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. ఆడపిల్లలను పుట్టనిచ్చి.. ఎదగనిచ్చి.. మంచి చదువునిచ్చి.. బతకనివ్వాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్స్, ఆశ వర్కర్లు గ్రామ పెద్దలు, బాలింతలు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నవతెలంగాణ-జుక్కల్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షులు సతీష్ అన్నారు. బుధవారం జుక్కల్ మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులు సోమవారం అర్ధాకలితో అలమటించడంతో పాఠశాలను బుధవారం సందర్శించినట్టు ఆయన తెలిపారు. నాణ్యమైన భోజనం పెట్టేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడిఈ కృష్ణ బుధవారం తెలిపారు. 11 కెవి మెయింటెనెన్స్ కారణంగా నిజామాబాద్ రోడ్డు వద్ద, కమలా నెహ్రూ కాలనీ, కెనల్ కట్ట, బృందావని థియేటర్ల వద్ద ఉన్న కాలనీల్లో రేపు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వారు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు.

ఇన్సూరెన్స్ కంపెనీ వారిని మోసగించి
బైకులను అమ్మిన కేసులో నిందితుల అరెస్ట్

ఏసిపి జె.వెంకటేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ

ఇన్సూరెన్స్ కంపెనీ వారిని మోసగించి బైకులను వేరే గ్రామాల వారికి అమ్మిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్టు నందు ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పట్టణ శివారులోని ఆలూరు బైపాస్ వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా, నిందితులను పట్టుకున్నట్టు తెలిపారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ కు చెందిన షాహిద్ ఆలీ ఒక పథకం ప్రకారం ఆయన స్నేహితుడైన సయ్యద్ ఓమేర్ తో కలిసి అడ్రస్ ప్రూఫ్ సరిగా లేని వారి యొక్క ఐడి కార్డులను సృష్టించాడు. వాటి ద్వారా బైకు షోరూమ్‌లలో అతని డౌన్ పేమెంట్ కట్టి హీరో ఫిన్ కార్పు లిమిటెడ్ ఫైనాన్స్ ద్వారా లోన్ తీసుకున్నాడు. హీరో కంపెనీకి చెందిన బైకులను కొనుగోలు చేశాడు. వాటిని షబీర్ ఖాన్ అనే వ్యక్తి ద్వారా కామారెడ్డికి చెందిన మహమద్ యాసిన్‌కు పంపించాడు. వీరి ద్వారా ఆర్మూర్ మండలంలోని మిర్దాపల్లి గ్రామానికి చెందిన కళ్లెం యోగేష్ రెడ్డి, శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన బంటు ప్రశాంత్, అంకాపూర్ గ్రామానికి చెందిన కొమ్ముల వెంకటరెడ్డి, సిరికొండ మండలంలోని హుస్సేన్ నగర్ కు చెందిన తీనేటి నరేష్, ధర్పల్లి మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కాట్పల్లి శ్రీకాంత్‌ను ఏజెంట్లుగా చేసుకొని వీరి ద్వారా బైకులను ఆర్మూర్, డొంకేశ్వర్ ,సిరికొండ, ధర్పల్లి, మాక్లూర్ మండల ప్రజలకు విక్రయించారు. ఇందుకు గాను బైకులు అమ్మిన వ్యక్తికి ఒక్కో బైక్‌కు మూడు వేల నుంచి 5000 వరకు, ఏజెంట్లుగా ఉన్నవారికి 1000 నుండి 2000 రూపాయల కమిషన్ ఇచ్చేవారు. వీరు ఇవే కాకుండా వేరే ఫైనాన్స్ కంపెనీల నుండి లోను తీసుకున్న మరికొన్ని బైక్‌లను అమ్మినట్టు తెలిపారు. టర్సరి సేల్స్ మేనేజర్, హీరో ఫిన్ కార్ప్ లిమిటెడ్ హైదరాబాద్‌కు చెందిన షేక్ అబ్దుల్ రఫీ ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషిచేసిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సత్యనారాయణ, ఎస్సైలు టి గోవింద్, ఇంద్రకరణ్ రెడ్డి, మహేష్ లతో పాటు ఐడి పార్టీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి , రాములు సిబ్బంది అశోక్, శ్రీనివాస్, ఆనంద్, హరీష్‌ను ఏసీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ క్రైమ్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో కోసమే హత్య

- మిత్రుడి ఘాతుకం
- ఘరానా నిందితుడి అరెస్ట్
- హత్య కేసును ఛేదించిన పోలీసులు



నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆటో కోసమే మిత్రుడినే హత్య చేసిన కేసులో ఘరానా నిందితుడిని అరెస్టు చేసినట్టు నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎల్ రాజ వెంకటరెడ్డి తెలిపారు. ఈ నెల 17న ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లి అటవి పాంతంలో వెలుగు చూసిన గుర్తు తెలియని యువకుడి హత్య కేసును పోలీసులు 24 గంటల వ్యవధిలో ఛేదించారు. బుధవారం నగరంలోని ఏసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో హత్య కేసు వివరాలను వెల్లడించారు. ఏసిపి కథనం ప్రకారం.. ఇందల్వాయి అటవి ప్రాంతంలో గుర్తు తెలియని యువకుడిని హత్య చేసి దహనం చేసిన వివరాలు స్థానికుల ద్వారా తెలుసుకుని, పోలీసులు అక్కడికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈనెల 15న తన భర్త కండేలా సందిప్(28) కనిపించడం లేదని నగరంలోని నాగారం బ్రహ్మణ కాలనీకి చెందిన కండేలా లత ఐదవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. మిస్సింగ్ కేసుకు అటవి ప్రాంతంలో మృతుడి వివరాలు పోలికలు ఉండటంతో నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై గంగాధర్‌లు దర్యాప్తు చేశారు. ఈ కేసులో నాగారంకు 80 క్వార్టర్స్‌కు చెందిన బైరగోని సతీష్ గౌడ్‌ను బుధవారం మాదనగర్ వద్ద అదుపులోకి తీసుకోవడంతో సందీప్ హత్య కేసు కొలిక్కి వచ్చింది. బైరగోని సతీష్‌గౌడ్ పాత నేరస్తుడు. అతనిపై 2020 నుంచి దొంగతనం కేసులు నాలుగు నమోదయ్యాయి. దానితో పాటు వనస్థలిపురంలో బంగారు నగల కోసం మహిళను హత్య చేసిన కేసు విచారణలో ఉంది. సతీష్ గౌడ్‌కు ఇదివరకే వివాహం జరిగింది. భార్య భర్తల మధ్య విబేదాలతో అతని భార్య హైదరాబాద్‌లో పుట్టింటిలో ఉంటుంది. ఏపని చేయని సతీష్‌గౌడ్ జల్సాల కోసం దొంగతనాలు చేసేవాడు. అప్పుడప్పుడు నాగారంకు వచ్చి వెళ్లేవాడు. నాలుగు సంవత్సరాల క్రితం ఆటో డ్రైవర్‌గా పనిచేసే సందీప్‌తో సతీష్‌గౌడ్‌కు స్నేహం కుదిరింది. కానీ ఇటీవల కాలంలో సతీష్‌గౌడ్ వద్ద డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు.

డబ్బులు సులువుగా సంపాదించాలని ప్రయత్నిస్తుండగా ఇటీవల సందిప్ ఆటో కొనుక్కుని తింపుతున్నట్టు గుర్తించాడు. ఆ ఆటోను దొంగలించి అమ్ముకోవాలని ప్లాన్ వేశాడు. సతీష్‌గౌడ్ ఈ నెల 15న ఉదయం వేళ సందీప్ ఆటోలో ఎక్కి నగరంతో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాలలో మద్యం, కల్లు సేవించారు. కామారెడ్డి వెళితే మంచి గిరాకీ దొరుకుతుందని సందీప్‌ను నమ్మించి ఆటోలో సతీష్‌గౌడ్ కామారెడ్డికి పయనమయ్యారు. అప్పటికే మద్యం, కల్లు విపరీతంగా సేవించడంతో సందీప్ మత్తులో జోలుగుతున్నాడు. ఇదే అదనుగా ఇందల్వాయి మండలం చంద్రయాన్‌పల్లి అటవి ప్రాంతంలో ఉన్న కుంటవద్దకు ఆటోను తీసుకువెళ్లారు. అక్కడ కాల కృత్యాలు తీర్చుకునే నెపంతో కిందకు దిగిన సతీష్ అక్కడ అదను కోసం వేచి ఉన్నాడు. సందీప్ ఆటో దిగి కుంటవద్దకు వెళ్లగా అతడిని వెనుక నుంచి తోసేసాడు. కిందపడిన సందీప్‌పై బండరాయితో ఛాతీపై మోది హత్య చేశాడు. అక్కడే ఉన్న కట్టెలు, చెత్తతో సందీప్ డెడ్‌బాడీని దహనం చేశాడు. మొబైల్, ఆటోను తీసుకుని హైదరాబాద్‌కు పరారీ అయ్యాడు. బుధవారం మాధవనగర్ వద్ద దొరికిన సతీష్‌ను పోలీసులు తమదైన శైలిలో విచారించగా తానే సందీప్‌ను హత్య చేసినట్టు ఒప్పుకోగా అతడి వద్దనుంచి ఆటో, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మిస్సింగ్, మర్డర్ కేసును 24 గంటల వ్యవధిలో ఛేదించిన నార్త్ రూరల్ సిఐ, ఐదవ టౌన్ ఎస్ ఐలను సిబ్బందిని ఎసిపి రాజా వెంకట్‌రెడ్డి అభినంధించారు.